క్లుప్తంగా

మాడుగులలో భారీ వర్షం

మాడుగుల: మండలంలో ఆరు నెలలు తర్వాత ఎట్టకేలకు ఆదివారం సాయంతరం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండి, సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో జనజీవనంతో పాటు పశుపక్షాదులు ఊపిరి పీల్చుకున్నాయి. ప్రస్తుతం రబీ పంటలైన సుమారు 3 వేల ఎకరాలలో నువ్వు, పెసర, మినుము, వరి చేలు తెప్పరిల్లాయి. మంచి సమయంలో వర్షం కురవడంతో రబీ వరి చేలు కలసి వస్తాయయని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సరుగుడు జలపాతం కళకళ



జలపాతం వద్ద సందర్శకుల సందడి

నాతవరం: సరుగుడు జలపాతం ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. ఎత్తైన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే నీటిలో జలకాలు ఆడుతూ సరదాగా గడిపారు. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నలుమూలల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతం కళకళలాడింది. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ సందర్శకుల తాకిడి ఎక్కడా తగ్గలేదు. ద్విచక్ర వాహనాలు, కార్లు అధిక సంఖ్యలో రావడంతో సరుగుడు రూటులో రద్దీ నెలకొంది.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



ఖండివరంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుంకర శ్రీనివాసరావు

చీడికాడ: స్వాతంత్ర్య సమరయోధుడు, సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతికార్యక్రమం ఆదివారం ఖండివరం గ్రామంలో జరిగింది. స్థానిక ప్రధాన కూడాలిలో భగత్‌సింగ్ చిత్రపటానికి చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ గెంజి కృష్ణ, పాల సొసైటీ-2 అధ్యక్షుడు సుంకర లగ్గన్న, విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బల్లెంకల లోవ, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి రాజు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ నిర్మాణానికి విరాళం



షిర్డీసాయి ఆలయానికి విరాళం అందిస్తున్న గుమ్మాల నాయుడు, లోవ లక్ష్మి దంపతులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామంలో తలపెట్టిన షిర్డీసాయి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన గుమ్మాల నాయుడు, లోవ లక్ష్మి దంపతులు ఆదివారం రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు పడాల అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ పడాల చిట్టిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

28న జాబ్‌మేళా

అనకాపల్లి టౌన్: పట్టణంలోని సాయికుల్వంత్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం కామరాజు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఐసాన్ ఎక్స్‌పీరియన్స్ కంపెనీలో టెలిసేల్స్ రిప్రజెంటేటివ్, నిట్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్, డెక్కన్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్, మెయిన్‌టెనెన్స్), జూనియర్ ఇంజనీర్, సీనియర్ ఇంజనీర్, జూనియర్ కెమిస్ట్, సీనియర్ కెమిస్ట్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్ రిలేషన్‌షిప్ మేనేజర్, ఇసుజు మోటార్స్, ఇండో ఎంఐఎం, పానాసోనిక్, హోం డాయ్ మోబీస్ కంపెనీలలో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పై ఉద్యోగాలకు ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఆయా కంపెనీల బట్టీ ఉంటుందన్నారు. అభ్యర్థులు కళాశాల వద్దకు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ జెరాక్స్ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

కార్పొరేషన్ రుణాల గడువు పొడిగింపు

అచ్యుతాపురం రూరల్: వెనుకబడిన తరగతుల వారు ఉపాధి పొందడానికి ప్రభుత్వం విడుదల చేసిన కార్పొరేషన్ రుణాల గడువు పొడిగించినట్లు మండల అభివృద్ధి అధికారి ప్రభాకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 వరకూ ఆన్‌లైన్ ద్వారా అన్ని వర్గాల వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.



రోడ్డు వేయాలని ఆందోళన చేస్తున్న గిరిజనులు (ఫైల్)



రోగిని డోలీలో తరలిస్తున్న గిరిజనులు

మైదాన ప్రాంతంలోనూ.. డోలీమోత

- రహదారి లేక డొంకాడ గిరిజనుల అవస్థలు
- కష్టంగా వ్యవసాయ ఉత్పత్తుల చేరవేత
- రోగుల తరలింపునకూ ఇబ్బందులే
- కూటమి నేతల హామీ గాలికి
- నెల రోజుల్లోగా సమస్య పరిష్కరించాలని గిరిజనుల డిమాండ్
- లేకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరిక

గొలుగొండ: ఏజెన్సీలో డోలీమోతల గురించి తరచూ వింటుంటాం. కానీ మైదాన ప్రాంతంలో ఈ సమస్య ఉత్పన్నం కావడం అంటే ఆశ్చర్యపోవాల్సిందే. నర్సీపట్నం నియోజవకర్గంలో గొలుగొండ మండలం డొంకాడ గిరిజనులకు ఈ సమస్య తప్పడం లేదు. గ్రామం ఏర్పడి 15 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ వారిని ఈ సమస్య వదిలిపెట్టడం లేదు. సమస్య పరిష్కరించి తమను ఆదుకోవాలని గిరిజనులు ఎన్నిసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు మొర పెట్టుకున్నా స్పందించే నాథుడు కనిపించడంలేదు.

15 సంవత్సరాలుగా ఇబ్బందులు..

డొంకాడ గ్రామం ఏర్పడి 15 సంవత్సరాలు కావస్తోంది. ఇక్కడ రహదారి సదుపాయం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో ఉన్న కొయ్యూరు మండలం పలకజీడి గ్రామంలో ఉన్న ఆదివాసీ గిరిజనులు అప్పట్లో ఓటింగ్‌లో పాల్గొన్నారని మావోయిస్టులు వారిని గ్రామ బహిష్కరణ చేశారు. దాంతో వారంతా అప్పట్లో గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం ప్రాంతంలో ఉన్న ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో తలదాచుకున్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఇక్కడే పోడు వ్యవసాయం చేసుకుంటూ బతుకున్నారు.

జనజీవన స్రవంతికి దూరంగా..

డొంకాడ గిరిజనులు నివసిస్తున్న ప్రాంతం జనావాసాలకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో ఉన్న కృష్ణదేవిపేట-నర్సీపట్నం ప్రధాన మార్గానికి చేరుకోవాలంటే మూడు కిలోమీటర్ల దూరం రావాలి. పండించిన పంట తరలించాలన్నా.. ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నా ఎటువంటి రవాణా సదుపాయం లేని గిరిజనులు తప్పనిసరి పరిస్థితుల్లో డోలీనే ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ సమస్య వల్ల బుధవారం ముప్పల మేనీ అనే గర్భిణి నరకయాతన పడింది.

కూటమి నేతల హామీలు.. గాలిమూటలు..

ఈ గ్రామానికి రోడ్డు వేస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఇక్కడ చిన్నా పెద్దా కలిపి 175 మంది వరకు నివసిస్తున్నారు. ఓట్ల కోసం రోడ్డు వేస్తామని చెప్పిన నేతలు గెలిచిన తర్వాత కనిపించలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు కాగా అటవీ శాఖ అనుమతులు వచ్చే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు జరగలేదు. ఇప్పటి ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గిరిజనుల సమస్య అలాగే ఉండిపోయింది. ఈ నేపథ్యంలో గిరిజనులు ఇటీవల మూడు కిలోమీటర్ల మేర డోలీ మోసి తమ నరసన తెలిపారు. నెల రోజుల్లోగా అటవీ శాఖ అనుమతులు తీసుకొచ్చి రోడ్డు వేయాలని.. లేదంటే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేయనున్నట్లు గిరిజనులు స్పష్టం చేస్తున్నారు.

రోడ్డు లేక ఇబ్బందులు..



గ్రామం ఏర్పడి 15 సంవత్సరాలు అవుతున్నా రోడ్డు నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీనివల్ల పంట తరలించే సమయంలో, అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయమై ఇటీవల నిరసన తెలిపాం. అధికారులు, ప్రజా ప్రతినిదులు హామీ నెరవేర్చకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తాం.

– సత్తిబాబు, డొంకాడ గ్రామం

కూటమి సర్కార్ వైఫల్యాలపై నేడు ధర్నా



కె.కోటపాడులో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : సూపర్ సిక్స్ పథకాలు అంటూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు తెలిపారు. కె.కోటపాడు, సూర్రెడ్డిపాలెం గ్రామాల్లో ఆదివారం ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలను అమలు చేయలేని కూటమి సర్కార్ వైఫల్యాలపై జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. గత 10 నెలలుగా అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలను అదుపు చేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. చెరకు రైతు సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఉపాధి బకాయిలు 12 వారాలుగా వేతనదారులకు అందడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి నాయినిబాబు, ఈర్లె నాయుడుబాబు, గాడి ప్రసాద్ పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లు, కల్వర్టు పనుల పూర్తికి కృషి



కల్వర్టు పనులకు మార్కింగ్ చేస్తున్న పంచాయతీరాజ్ శాఖ డీఈ ఈశ్వరరావు

నాతవరం: మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో సిమెంట్ రోడ్లు, కల్వర్ట్ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని పంచాయతీరాజ్ శాఖ డీఈ ఈశ్వరరావు తెలిపారు. ఎం.బి.పట్నం గ్రామంలో ఆదివారం రూ.8 లక్షలతో తలపెట్టిన కల్వర్టు, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలాఖరుకు శత శాతం పనులు చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ జేఈ వెంకటేశ్వరమ్మ, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు రాజాన సూర్య చంద్ర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వయోజనులకు విద్యా సామర్థ్య పరీక్షలు



నాతవరంలో పరీక్షలు రాస్తున్న వయోజనులు

నాతవరం: ఉల్లాస్ నవ భారత్ సాక్షరతా కార్యక్రమంలో భాగంగా 51 కేంద్రాల్లో ఆదివారం వయోజనులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం కనకరాజు మాట్లాడుతూ చదువురాని వయోజనులు చదవడం, రాయడం, లెక్కలు చేసుకునేలా నేర్పించడం ఉల్లాస్ నవ భారత్ సాక్షరతా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గతేడాది నవంబరు నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించాయన్నారు. ప్రధానంగా డ్వాక్రా సంఘాల మహిళలకు గ్రామాల్లో వయోజన విద్య ద్వారా శిక్షణ ఇచ్చామన్నారు. మండల వ్యాప్తంగా ఈ పరీక్షలకు 570 మంది వయోజనులు హాజరు కావాల్సి ఉండగా.. 531 మంది హాజరై పరీక్షలు రాశారన్నారు.

గ్రామాల్లో బోర్ల నిర్మాణానికి భూమి పూజ



బోరు ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న ఎంపీటీసీ సత్యవతి



చీడికాడలో మంచినీటి బోరు పనులకు శంకుస్థాపన చేస్తున్న పరువాడ మహేశ్, తదితరులు

రోలుగుంట: బుచ్చంపేట గ్రామానికి చెందిన ఉలబాల కుటుంబాలకు చెందిన కళ్లాలు వద్ద తాగునీటి బోరు ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ చేశారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఉలబాల సత్యవతి సహకారంతో లక్ష రుపాయలు మంజూరయ్యాయి. ఈ నిధులతో భూమి పూజ చేసి, రిగ్గు పనులు ప్రారంభించారు.

తాగునీటి మంచినీటి బోర్లకు భూమి పూజ

చీడికాడ: జెడ్పీటీసీ నిధులతో చీడికాడలో పలు చోట్ల తాగునీటి బోర్ల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో స్థానిక తెలకలవారి కళ్లాల వద్ద, ఇండస్ అమ్మవారి గుడివద్ద, కొల్లి, కోలుపురి వారి కళ్లాల వద్ద రూ.2 లక్షల చొప్పున నిధులతో ఏర్పాటు చేయనున్న మంచినీటి బోర్లకు వైఎస్సార్‌సీపీ చీడికాడ గ్రామ శాఖ అధ్యక్షుడు పరువాడ మహేశ్, జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదా జానకీరామ్, ఎంపీపీ కురచా జయమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు తొల్లవిల్లి రాజుబాబు, భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. స్థానిక పాల సొసైటీ అధ్యక్షుడు పరువాడ అప్పారావు, బూడి యువసేన సభ్యులు నాయుడు, శిరిసాల మహేశ్, వెంకట శివకుమార్ పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణం



జి.కోడూరులో జగనన్న కాలనీకి వేస్తున్న రోడ్డు

మాకవరపాలెం: జి.కోడూరులో జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉపాధి హామీ పథకం కింద రూ.40 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆదివారం నుంచి సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. వీటితోపాటు బూరుగుపాలెం, మాకవరపాలెం, రామన్నపాలెం, జంగాలపల్లి, గిడుతూరు, తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

తుది దశకు నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణం



ఆనందపురంలో తుది దశకు చేరుకున్న నూకాంబిక అమ్మవారి ఆలయం పనులు

కె.కోటపాడు : ఆనందపురం గ్రామంలో నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. గ్రామంలో అమ్మవారి ఆలయ నిర్మాణాన్ని సర్పంచ్ వంటాకు అప్పాజీ పర్యవేక్షణలో గ్రామస్తుల ఐక్యతతో చేపట్టారు. సుమారు రూ.12లక్షల నిధులను సమీకరించి నిర్మాణం చేపట్టినట్టు సర్పంచ్ అప్పాజీ తెలిపారు. ఈ నెల 31న అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వేద పండితుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించనున్నామన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెందుర్తి: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే జైలుపాలు కావాల్సి వస్తుందని సబ్ ఇన్‌స్పెక్టర్ స్వామినాయుడు రౌడీ షీటర్లను హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకుంటే రౌడీ షీట్‌లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయనున్నట్లు పేర్కొన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

మాల ఉపకులాలపై కుట్రలను తిప్పికొట్టాలి



మునగపాకలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దళితులు

మునగపాక: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడవకుండా మాల ఉప కులాలపై కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని అంబేడ్కరిజం పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు పిలుపునిచ్చారు. మునగపాక బీసీ కాలనీలోని పూర్వపు సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప కులాల పేరిట కుట్రలు జరుగుతున్నాయన్నారు. షెడ్యూల్ కులాల జనాభా నిష్పత్తి ప్రకారం 15 శాతం మాలలకు రిజర్వేషన్లు పెంచాలన్నారు. ఇంతవరకు భర్తీకి నోచుకోని బ్యాక్‌లాగ్ పోస్టులపై దృష్టి సారించాలన్నారు. అంబేడ్కర్ పొందుపరిచిన రాజ్యాంగ ప్రయోజనాలను రాజకీయాలకు ఉపయోగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో గుంట్ల అప్పారావు, బీలా శివగణేష్, లంబా అర్జునరావు, కారు శాంతకుమార్, మార్లపల్లి గణపతి అప్పారావు, తట్ట అశోక్‌కుమార్, బైపా శేషుకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మధ్యాహ్నపమ్మ తల్లి తీర్థం



కొత్తూరులో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



జిల్లా స్థాయి పోటీలలో ఉరకలేస్తున్న ఎడ్ల బళ్లు

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడ పంచాయతీ శివారు కొత్తూరులో మధ్యాహ్నపమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక ప్రజలు తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజులు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు, మండల యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కిల్లాన శ్రీను, వెంకటరాజుపురం సర్పంచ్ దాసరి సంతోష్‌కుమార్, తెనుగుపూడి ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, తదితర నాయకులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీలలో ప్రథమ స్థానంలో అర్జునగిరికి చెందిన పరవాడ నాయుడు ఎడ్లు, ద్వితీయ స్థానంలో చుక్కపల్లికి చెందిన మజ్జి రాజేష్ ఎడ్లు, తృతీయ స్థానంలో లక్కవరానికి చెందిన నేమాల నరేష్ ఎడ్లు నిలిచాయి. విజేతలకు వరుసుగా రూ.10 వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులను నాయకులు, గ్రామ పెద్దలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గన్ని వీరన్న చౌదరి, బొబ్బిలి రాము, కోన సత్యం, బొబ్బిలి పెద అప్పారావు, బొబ్బిలి త్రిముర్తులు, బొబ్బిలి శ్రీను, ఈశ్వరరావు, చిన అప్పారావు, వెంకునాయుడు, చినసత్యం తదితర్లు పాల్గొన్నారు. రాత్రి ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు





ప్రత్యేక అలంకరణలో మాడుగులలో మోదకొండమ్మ, ఎం.కోడూరు మోదమాంబ

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన భక్తులు వీధి పండగలు కూడా నిర్వహించారు. అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను శిరస్సున పెట్టుకుని ఆలయానికి కాలి నడకన చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొత్త అమావాస్య ముందు అమ్మవారి ఆలయానికి తరలివెళ్లడం ఈ ప్రాంత భక్తుల ఆచారం. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది.

ఎం.కోడూరులో..

మాడుగుల రూరల్: ఎం.కోడూరులోని మోదమాంబకు ఆదివారం ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు పర్యవేక్షణలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు ఘటాలతో అమ్మవారికి ఒడ్డు పండగలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యులు

రావికమతం: కొత్తకోట గ్రామంలో స్థానిక వాసవీ వనిత క్లబ్ సౌజన్యంతో ఆర్యవైశ్యుల సహకారంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 103 మంది రోగులకు వైద్యులు రుత్తల సురేష్, తదితరులు పరీక్షలు చేశారు. వారిలో 50 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. మిగతా వారికి అవసరమైన మందులు ఉచితంగా అందచేశారు. ఆపరేషన్ అవసరమైన 50 మందిని శంకర్ ఫౌండేషన్‌కు తీసుకెళ్లి ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తామని ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్ తెలిపారు.

దేవరాపల్లిలో 84 మందికి వైద్య పరీక్షలు



దేవరాపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో సత్య సేవా సమితి సభ్యుల సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎస్.కోటకు చెందిన కోలపర్తి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన స్త్రీ వైద్య నిపుణులు, జనరల్ సర్జన్ పి.వరలక్ష్మి రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో 84 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో కొందరికి ఆపరేషన్లు అవసరమని, మరికొందరికి మెరుగైన వైద్య సేవలు అందించాల్సి ఉందని గుర్తించి, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గణేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టు చెంత యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు



ప్రాజెక్టు సమీపంలో ఇసుక తవ్వేసిన దృశ్యం

మాకవరపాలెం: తాగునీటి ప్రాజెక్టు చెంతనే జరుగుతున్న ఇసుక తవ్వకాలను ఆపాలని గిడుతూరు గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న వరహానదిలో రూ.10.10 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మించారు. దీని ద్వారా సుమారు 15 గ్రామాల ప్రజలకు నిత్యం తాగునీరు అందుతోంది. ఇటీవల ఈ ప్రాజెక్టు చెంతనే ఇసుక తవ్వకాలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తవ్వకాలను ఆపాలని, లేకుంటే వేసవిలో తాగు, సాగు నీటికి ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.